# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :24 07-08- 2026 శుక్రవారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు TGTEL/25/A0871 జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


# ప్రజల రవాణా సౌకర్యాలే లక్ష్యం..

## రోడ్ నెట్‌వర్క్‌ను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిలో చేపడుతున్న కీలక రహదారి ప్రాజెక్టులు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, నిధుల సమీకరణ, నిర్వహణ, ప్రాజెక్టుల అమలు వంటి అన్ని అంశాలను సమన్వయం చేసేందుకు సమగ్ర వ్యవస్థ అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు సహా అన్ని రహదారి ప్రాజెక్టులు ఒకే వ్యవస్థ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రోడ్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడం,

2

# కస్టమ్ మిల్లింగ్ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ లేఖ

## రూ.500 కోట్ల కుంభకోణంపై సమగ్ర విచారణకు రామచందర్‌రావు డిమాండ్




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ బియ్యం (జవీ=) కేటాయింపులు, సేకరణ ప్రక్రియలో చోటుచేసుకున్న భారీ అక్రమాలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర ఆగ్రహం

2

# అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తా - కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ అత్యంత వైభవంగా, వేలాది మంది జనసందోహం మధ్య జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రసంగించారు. భౌగోళిక తెలంగాణను సాధించుకున్న తర్వాత, మన అసలైన లక్ష్యమైన సామాజిక న్యాయ తెలంగాణను తీర్చిదిద్దేందుకు ఈ సభ ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సామాజిక న్యాయ సంకల్ప సభ తెలంగాణలోని కోట్లాది మంది అణగారిన ప్రజల జీవితాల్లో మహత్తరమైన మార్పును తేబోతోందని ఆమె ఆకాంక్షించారు.

సామాజిక న్యాయం యొక్క చారిత్రక ఆవశ్యకతను కవిత వివరంగా గుర్తుచేశారు. పూర్వం రాజరికం ఉన్న కాలంలో ప్రజలపై ఎన్నో దాష్టీకాలు జరిగాయని, అయితే ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత మన రాజ్యాంగం ద్వారా ఆ అమానవీయ పరిస్థితులను మార్చుకోగలిగామని తెలిపారు. అయినప్పటికీ, మన రాజ్యాంగ ఫలాలను పూర్తిస్థాయిలో సమాజంలోని చివరి వ్యక్తికి అందించడంలో విఫలమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా సామాజిక న్యాయం అనగానే అగ్రవర్ణాలు తమ సీట్లకు లేదా స్థానాలకు ఎక్కడ భంగం వాటిల్లుతుందోనని భయపడతారని, కానీ ఈ దేశంలో వచ్చిన అనేక విప్లవాత్మక మార్పులకు అగ్రకులాల్లోని ప్రజాస్వామ్యవాదులే ప్రధాన కారణమని ఉదాహరణలతో వివరించారు. ఒక క్షత్రియ పుత్రుడైన గౌతమ బుద్ధుడు రాజ్యం వదిలి ప్రజాస్వామ్య బద్ధమైన వ్యవస్థకు నాంది పలికారని, రాచరిక కాలంలోనే సాహు మహారాజ్ రిజర్వేషన్లు ఇచ్చి తన గొప్పతనాన్ని చాటుకున్నారని తెలిపారు. అలాగే మండల్ కమిషన్ నివేదికను పక్కన పెట్టిన తరుణంలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ దానిని అమలు చేశారని, తమిళనాడులో బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్పించిన ఘనత జయలలితకే దక్కుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో భూస్వాముల గడీలను తరిమికొట్టి ఆర్థిక అసమానతలను కొంతవరకే పోగొట్టుకున్నామని, కులవివక్షను తరిమికొట్టేందుకు జరగాల్సినంత పోరాటం ఇంకా జరగలేదని అన్నారు.

తనపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ, తాను బీసీల గురించి మాట్లాడితే అగ్రవర్ణాల్లో పుట్టిన నీకెందుకు అంటూ హేళన చేస్తారని, కానీ తన పుట్టుక తన చేతుల్లో లేకపోయినా తాను ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకునే హక్కు తన చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. గ్రామపంచాయితీ ముఖం కూడా చూడని వెనుకబడిన కులాల్లో సాధికారిత తెచ్చే వరకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రకటించారు. వంద మందికి వంద రొట్టెలు ఉన్నప్పుడు పది మంది మాత్రమే తొంభై రొట్టెలు తినడం తీవ్రమైన అన్యాయమని, వంద మంది ఆకలి తీర్చడమే నిజమైన సామాజిక న్యాయమని చెప్పారు.

ఈ దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలలో 71 శాతం మంది దళితుల కంటే దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆమె తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు వచ్చేంత వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాబోయే బడ్జెట్ సెషన్‌లోగా బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపాలని, లేకపోతే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి మారోజు వీరన్న స్ఫూర్తితో పోరాడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

ఈ సభ ద్వారా అనేక విప్లవాత్మక తీర్మానాలను ప్రతిపాదించారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనతో పాటు, సామాజిక వైతాళికులు మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు 'భారత రత్న' పురస్కారం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు 'పద్మవిభూషణ్' ఇవ్వాలని, ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల నిధులను వారి అభ్యున్నతికే ఖర్చు చేయాలని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఆదివాసీలకు అడవులపై సంపూర్ణ హక్కులు కల్పించడంతో పాటు, డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. ముస్లింలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డు చట్టం, ఆర్థిక స్వావలంబన కల్పించాలని, సిక్కులు, క్రిస్టియన్లకు ఆర్థిక భరోసా ఇవ్వాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు సంపూర్ణ హక్కులు, వికలాంగులకు పెన్షన్ల పెంపుతో పాటు కో-ఆప్షన్ సభ్యత్వాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# కేటీఆర్‌పై ఏసీబీ చార్జ్‌షీట్

## ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో సంచలన పరిణామాలు




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తూ ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) 75 పేజీల సుదీర్ఘ చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసింది. ప్రభుత్వ నిబంధనలను, రాజ్యాంగ నియమాలను పూర్తిగా ఉల్లంఘించి, ముందస్తు అనుమతులు లేకుండా ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహించడం ద్వారా రాష్ట్ర ఖజానాపై సుమారు రూ. 600 కోట్ల భారీ ఆర్థిక భారాన్ని మోపారని ఏసీబీ తన అభియోగపత్రంలో తీవ్ర ఆరోపణలు గుప్పించింది.

కేసులో నిందితులు మరియు మోపబడిన సెక్షన్లు

ఈ కేసులో కేటీఆర్‌ను ప్రధాన నిందితుడు (ఏ1)గా ఏసీబీ చేర్చింది. ఆయనతో పాటు పలువురు కీలక అధికారులు, సంస్థలపై కూడా అభియోగాలు మోపింది:

కేటీఆర్ (ఏ1): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

అరవింద్ కుమార్ (ఏ2): మాజీ ఐఏఎస్ అధికారి

బీ.ఎల్.ఎన్. రెడ్డి (ఏ3): ప్రభుత్వ అధికారి

గోవాడ కిరణ్ మల్లేశ్వర రావు (ఏ4): స్పోర్ట్స్ కన్సల్టెంట్

ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఏ5): సంబంధిత రేసింగ్ సంస్థ

వీరందరిపై క్రిమినల్ కుట్ర, నమ్మకద్రోహం, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగానికి సంబంధించిన బలమైన ఆధారాలు లభించాయని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో భారతీయ శిక్షా స్మృతి లోని సెక్షన్ 409 (అధికారంలో ఉన్న వ్యక్తి నమ్మకద్రోహానికి పాల్పడటం), సెక్షన్ 120బీ (క్రిమినల్ కుట్ర)లతో పాటు అవినీతి నిరోధక చట్టం (గ్రతీవజవత్‌అశీఅ శీట జశీతీతీబజ్‌అశీఅ-ాఛ్) లోని పలు కీలక సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు.

నిబంధనల ఉల్లంఘన మరియు రూ. 600 కోట్ల ఆర్థిక భారం

కేబినెట్, ఆర్థిక శాఖ, అలాగే న్యాయ శాఖల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే ఫార్ములా-ఈ రేసింగ్ సీజన్-10ను తెలంగాణలో నిర్వహించేందుకు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున అధికారికంగా సంతకం చేసే అర్హత లేదా అధికారం లేకపోయినప్పటికీ, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ (ఏ2) ద్వారా 2022 జనవరి 17న 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' పై సంతకం జరిగేలా కేటీఆర్ చురుగ్గా వ్యవహరించారని ఏసీబీ ఆరోపించింది.

అనంతరం, 2023 సెప్టెంబర్ 27న హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (ఎవీ-ణూ) రూపొందించిన నోట్ ఫైళ్లకు ఆమోదం తెలిపే క్రమంలో.. ఆర్థిక శాఖ, న్యాయ శాఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ), మరియు మంత్రివర్గంతో తప్పనిసరిగా జరపాల్సిన సంప్రదింపులను పూర్తిగా పక్కన పెట్టారు. అరవింద్ కుమార్ ద్వారా ఒప్పందాలను అమలు చేసేందుకు అనుమతినిస్తూ, రాజ్యాంగ నిబంధనలు, హెచ్ఎమ్‌డీఏ చట్టం, సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్, అలాగే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తీవ్రంగా ఉల్లంఘించారని ఏసీబీ వివరించింది.

గతంలో రేసింగ్ నిర్వహించిన ప్రమోటర్ భారీ నష్టాలు చవిచూశాడనే విషయం తెలిసినప్పటికీ, కావాలనే హెచ్ఎమ్‌డీఏను సీజన్ 10, 11, మరియు 12లకు ప్రమోటర్‌గా ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు. దీనివల్ల రాబోయే మూడు సీజన్లకు కలిపి ప్రభుత్వంపై రూ. 600 కోట్ల ఆర్థిక భారం పడిందని తేల్చారు. అంతేకాకుండా, హెచ్ఎమ్‌డీఏ చట్టబద్ధ పరిధికి వెలుపల రూ. 75,88,65,179 నిధులను అక్రమంగా వినియోగించారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల తీవ్ర నష్టం వాటిల్లగా, ప్రైవేట్ సంస్థలకు భారీగా అక్రమ లాభం చేకూరిందని చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు.

ఎలక్టోరల్ బాండ్లు మరియు రూ. 46.82 కోట్ల చెల్లింపులు (క్విడ్ ప్రో కో)

ఈ మొత్తం వ్యవహారంలో 'క్విడ్ ప్రో కో' (ప్రతిఫలం ఆశించి లబ్ధి చేకూర్చడం) స్పష్టంగా కనిపిస్తోందని ఏసీబీ పేర్కొంది. ఫార్ములా-ఈ రేసింగ్ ప్రమోటర్ సంస్థ అయిన కి చెందిన అనుబంధ కంపెనీల ద్వారా నాటి అధికార పక్షమైన బీఆర్ఎస్ పార్టీకి రూ. 44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు అందాయని ఏసీబీ సంచలన విచారణ నివేదికను వెల్లడించింది. ఈ బాండ్ల రూపంలో లబ్ధి పొందినందుకు ప్రతిఫలంగానే సదరు ప్రైవేట్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రేసింగ్ నిర్వహణ బాధ్యతలను కట్టబెట్టారని ఏసీబీ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా ప్రస్తావించింది.

దీనికి తోడు, నిబంధనలను అతిక్రమించి హెచ్ఎమ్‌డీఏ (నవీణూ) నిధుల నుంచి ఏకంగా రూ. 46.82 కోట్లను నేరుగా ఆ సంస్థలకు చెల్లించినట్లు విచారణలో నిరూపితమైందని ఏసీబీ అధికారులు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రభుత్వ ధనాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టినందుకు, కేటీఆర్‌తో పాటు మిగిలిన నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీబీ తన 75 పేజీల అభియోగపత్రంలో న్యాయస్థానాన్ని కోరింది.

# పదేళ్ల చట్టం... తీరని వ్యథ.!

## దివ్యాంగుల హక్కులపై పాలకుల నిర్లక్ష్యం

భారతదేశంలో దివ్యాంగుల హక్కుల చట్టం అమలులోకి వచ్చి పదేళ్లు పూర్తవుతోంది. ప్రకటనలు, ఆర్భాటాలు, ప్రభుత్వం మార్చిన పదజాలాలు పక్కన పెడితే క్షేత్రస్థాయిలో దివ్యాంగుల బతుకులు ఏమాత్రం మారాయా అంటే లభించే సమాధానం శూన్యమే. సంక్షేమ పథకాల భిక్ష కాకుండా రాజ్యాంగబద్ధమైన హక్కుల హోదాను కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా చేసిన చట్టం, పదేళ్ల తర్వాత కూడా కేవలం కాగితాలకే పరిమితమైన ఒక ఆశల పత్రంగా మిగిలిపోవడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల వైఫల్యానికి అద్దం పడుతోంది. దివ్యాంగులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత వైపు నడిపించాల్సిన ప్రభుత్వాలు కేవలం నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నాయి.

2016 చట్టం తీసుకురావడంలో ప్రధాన ఉద్దేశం వైకల్యాన్ని చూసే విధానంలో మార్పు తేడమే. 1995 నాటి పాత చట్టం కేవలం 7 రకాల వైకల్యాలను మాత్రమే గుర్తించగా, నూతన చట్టం దానిని 21 రకాలకు విస్తరించింది. మానసిక వైకల్యాలు, నరాల సంబంధిత సమస్యలు, యాసిడ్ దాడి బాధితులు, రక్తం లోపాలు వంటి అనేక రకాల రుగ్మతలతో బాధపడుతున్న వారిని కూడా ఈ చట్టం పరిధిలోకి తెచ్చారు. గౌరవప్రదమైన జీవనం, సమానత్వం, వివక్ష లేకపోవడం, విద్య మరియు ఉద్యోగాలలో సమ్మిళిత భాగస్వామ్యం వంటి పదాలు చట్ట పుస్తకాలలో సముచిత స్థానం సంపాదించుకున్నాయి. ఈ ప్రయాణంలో న్యాయస్థానాలు, ముఖ్యంగా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అందించిన తీర్పులు కొంత ఆశాజనకంగా నిలిచాయి. వికాస్ కుమార్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిస్తూ దివ్యాంగులకు తగిన వసతులు కల్పించడం అనేది ప్రభుత్వం అందించే ఉచిత భిక్ష కాదని, అదొక ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. వైకల్యాన్ని కేవలం నిర్దిష్ట శాతాల ప్రాతిపదికన కొలవలేమని, సమాజంలో ప్రతి ఒక్కరితో సమానంగా జీవించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడం ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంపైన కూడా చట్టబద్ధమైన బాధ్యత ఉందని తేల్చిచెప్పింది.

అయితే ఈ చట్టం అమలులో అత్యంత దారుణమైన లోపం డేటా సేకరణలో ఉందనేది స్పష్టమవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో కేవలం 2.68 కోట్ల మంది, అంటే మొత్తం జనాభాలో కేవలం 2.21 శాతం మంది మాత్రమే దివ్యాంగులు ఉన్నారని ప్రభుత్వం నమోదు చేసింది. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచ జనాభాలో దాదాపు 16 శాతం మంది ఏదో ఒక రకమైన తీవ్ర వైకల్యంతో జీవిస్తున్నారు. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో దివ్యాంగుల సంఖ్యను ఇంత తక్కువగా లెక్కించడం వెనుక స్పష్టమైన నిర్లక్ష్యం కనిపిస్తోంది. జనాభా లెక్కలోనే వారిని తగ్గించి చూపడం వల్ల బడ్జెట్ కేటాయింపుల్లో, ప్రభుత్వ పథకాల రూపకల్పనలో, విద్యా మరియు ఉద్యోగ అవకాశాలలో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. సరైన వర్గీకరణ, పారదర్శకమైన డేటా లేకుండా ఏ చట్టం కూడా విజయం సాధించలేదనేది చేదు నిజం.

మరోవైపు సుగమ్య భారత్ అభియాన్ పేరుతో ప్రభుత్వ భవనాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో మార్పులు తెచ్చామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా, ఆచరణలో ఏ ఒక్క భవనం కూడా సంపూర్ణ దివ్యాంగ స్నేహపూర్వకంగా మారలేదు. ఒక ప్రభుత్వ ఆఫీసు ముందు కేవలం ఒక రాంప్ నిర్మించినంత మాత్రాన ఆ భవనం సుగమ్యంగా మారిపోదు. అక్కడికి చేరుకోవడానికి తగిన ప్రజా రవాణా వ్యవస్థ ఉందో లేదో, లోపల వాడకానికి అనువైన శౌచాలయాలు ఉన్నాయో లేదో, దృష్టి లోపం ఉన్నవారి కోసం స్పర్శ బాటలు ఉన్నాయో లేదో లేదా వినికిడి లోపం ఉన్నవారి కోసం సైన్ లాంగ్వేజ్ సదుపాయాలు ఉన్నాయో లేదో ఎవరూ పట్టించుకోవడం లేదు. డిజిటల్ ఇండియాగా విస్తరిస్తున్న నేటి యుగంలో కూడా అనేక ప్రభుత్వ మరియు ప్రైవేట్ వెబ్‌సైట్‌లు, యాప్‌లు ఇప్పటికీ దివ్యాంగులకు అందుబాటులో లేకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనం.

దీనికితోడు యూనివర్సల్ డిజిటల్ ఐడి ద్వారా దివ్యాంగులకు సేవలు సులభతరం చేస్తామని ప్రకటించినప్పటికీ, గ్రామాల్లోని దివ్యాంగులకు అది ఒక పెద్ద సమస్యగా మారింది. సర్టిఫికెట్ పొందేందుకు ఆసుపత్రుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. వైద్యుల పట్టింపులేనితనం, డిజిటల్ అవగాహన లేకపోవడం, బ్యూరోక్రసీ అడ్డంకుల వల్ల అర్హులైన వేలాది మంది ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమవుతున్నారు. హక్కుల ఆధారిత వ్యవస్థలో దివ్యాంగులు తమ వైకల్యాన్ని, ఉనికిని నిరూపించుకోవడానికి ప్రతి నిమిషం పోరాటం చేయాల్సి రావడం పెద్ద లోపం. చట్టాన్ని అమలు చేయాల్సిన దివ్యాంగుల హక్కుల కమిషనర్లకు తగిన అధికారాలు, సిబ్బంది, బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల ఫిర్యాదుల పరిష్కారం నత్తనడకన సాగుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై లేదా అధికారులపై కఠిన చర్యలు తీసుకునే బలమైన యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. పాఠశాలల్లో దివ్యాంగ పిల్లలకు అడ్మిషన్లు నిరాకరించడం, ప్రత్యేక ఉపాధ్యాయులు లేకపోవడం నిత్యకృత్యమైంది. ఇక ఉద్యోగాల విషయానికి వస్తే, ప్రభుత్వ రంగంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మందగించడమే కాక ప్రైవేట్ రంగం అసలు బాధ్యత తీసుకోవడం లేదు. ఈ దశాబ్దపు వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని, రాబోయే రోజుల్లో చట్టానికి పదునైన అమలు విధానాలను జోడించాల్సి ఉంది. ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేట్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చే ముందే అది దివ్యాంగ స్నేహపూర్వకంగా ఉందో లేదో తనిఖీ చేసి కఠినంగా ఆడిట్ జరపాలి. రాబోయే జనాభా లెక్కింపులో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా డేటాను సేకరించి, బడ్జెట్‌లను జనాభా నిష్పత్తి ప్రకారం పెంచాలి. కేవలం ఉద్యోగాల



రిజర్వేషన్లకు పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వాములను చేసి గౌరవప్రదమైన జీవనోపాధిని కల్పించాలి. వాటన్నింటికంటే ముఖ్యంగా మా ప్రమేయం లేకుండా మా గురించి ఏదీ వద్దు అనే నినాదాన్ని నిలబెడుతూ పాలసీల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ ప్రక్రియల్లో దివ్యాంగులకు నేరుగా అధికారిక భాగస్వామ్యం కల్పించాలి. దివ్యాంగుల హక్కుల చట్టం పేపరు మీద అద్భుతంగా ఉన్నప్పటికీ, దానిని ఆచరణలోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వాలు చూపుతున్న ఉదాసీనతను వీడి, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వారికి సంపూర్ణంగా అందించినప్పుడే ఈ చట్టానికి నిజమైన సార్థకత చేకూరుతుంది.



**వెంకగారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

## ప్రజల రవాణా సౌకర్యాలే లక్ష్యం..
## రోడ్ నెట్‌వర్క్‌ను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి

రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, ఓఆర్ఆర్‌పై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

హైదరాబాద్ నగర భవిష్యత్ అభివృద్ధికి రేడియల్ రోడ్లు కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మిస్తున్న రేడియల్ రోడ్డు--1 పనులను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణంలో ఎదురయ్యే భూసేకరణ, సాంకేతిక, పరిపాలనా అడ్డంకులను వెంటనే పరిష్కరించాలని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడరాదని అధికారులకు స్పష్టం చేశారు.

రోడ్ల అభివృద్ధి అంటే కేవలం విస్తరణ మాత్రమే కాదని, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. ప్రతి రహదారికి ఇరువైపులా పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్ మహానగర భవిష్యత్ అభివృద్ధి పూర్తిగా రోడ్ల విస్తరణ, ఆధునిక రవాణా మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందువల్ల అవసరమైన భూసేకరణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. రోడ్ల విస్తరణ కోసం చేపట్టే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే టీడీఆర్‌ల జారీ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర రాజధానిని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, రహదారుల విస్తరణ, నాణ్యమైన నిర్మాణం, సక్రమ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అన్ని ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## కస్టమ్ మిల్లింగ్ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ లేఖ

వ్యక్తం చేసింది. రాష్ట్రంలో సుమారు రూ. 500 కోట్ల విలువైన, దాదాపు 90 వేల టన్నుల ధాన్యం అక్రమాలు జరిగినట్లు బీజేపీ సీనియర్ నాయకులు రామచందర్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 సంవత్సరం నుంచి రైస్ మిల్లులకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పరిమాణానికి, వారి నుంచి తిరిగి వచ్చిన బియ్యం లెక్కలకు మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నాయని ఆయన వేలెత్తి చూపారు. ఈ మొత్తం వ్యవహారంలో జరిగిన అక్రమాలపై పారదర్శకమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయనొక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో రామచందర్‌రావు పలు కీలక విషయాలను లేవనెత్తారు. ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేయడం, మిల్లింగ్ ప్రక్రియను పక్కదారి పట్టించడం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ ఎత్తున ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను సేకరించే ధాన్యం కొనుగోలు వ్యవస్థ అనేది వారి జీవనాధారాన్ని కాపాడే అత్యంత కీలకమైన వేదిక అని, అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థ (రాణా) కు ఇది వెన్నుముక లాంటిదని ఆయన గుర్తుచేశారు. కానీ, ఇలాంటి అక్రమాల కారణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా, జవాబుదారీతనంతో సాగాల్సిన ధాన్యం కొనుగోలు వ్యవస్థపై రైతులకు ఉన్న నమ్మకం తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు తన లేఖలో ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం సేకరణ, రవాణా, గోదాముల్లో నిల్వ చేయడం, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియల వరకు అన్ని దశల్లోనూ పర్యవేక్షణ లోపించిందని, దీనిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపించారు. అందువల్ల, ఈ అక్రమాలపై వేగవంతమైన, సమగ్రమైన విచారణ జరిపి, ఇందులో ఎంతటివారైనా దోషులుగా తేలితే చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# వర్షాకాలంలో జాగ్రత్త.. డెంగ్యూపై చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదం!

- వర్షాకాలంలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు.. ప్రారంభ దశలోనే చికిత్స తీసుకుంటే మంచిది...
- పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తతతోనే డెంగ్యూకు చెక్

**డాక్టర్ స్వప్న శశికాంత్ చిన్నపిల్లల వైద్యురాలు**

నిర్మల్ ఆగస్టు 6 తెలంగాణ వెన్నెల వాక్కు

వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాల కారణంగా అక్కడక్కడ నీరు నిల్వ ఉండటం, దోమల సంతానం వేగంగా పెరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు డెంగ్యూ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. డెంగ్యూకు ఇప్పటికీ ప్రత్యేకంగా వైరస్‌ను నిర్మూలించే మందు అందుబాటులో లేకపోవడంతో ముందుజాగ్రత్తలు, పరిశుభ్రత, సరైన సమయంలో వైద్య చికిత్స తీసుకోవడమే ప్రాణాలను కాపాడే మార్గమని బాలల వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే డెంగ్యూ వ్యాప్తిని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.


**డెంగ్యూ అంటే ఏమిటి... ఎలా వ్యాపిస్తుంది...?**

డెంగ్యూ అనేది వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధి. ఇది ఏడీస్ ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమలు సాధారణంగా పగటి వేళల్లో ఎక్కువగా కుడతాయి. ఇంటి చుట్టూ నిల్వ ఉండే పరిశుభ్రమైన నీటిలోనే ఈ దోమలు గుడ్లు పెడతాయి. నీటి ట్యాంకులు, కూలర్లు, పూలకుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి బొండాలు, ఫ్రిజ్ ట్రేలు వంటి వాటిలో కొద్దిరోజులు నీరు నిల్వ ఉన్నా దోమలు విపరీతంగా పెరుగుతాయి. డెంగ్యూ ఒకరి నుంచి మరొకరికి నేరుగా తాకడం వల్ల లేదా ఆహారం వల్ల వ్యాపించదు. వైరస్ సోకిన వ్యక్తిని కుట్టిన దోమ, తర్వాత ఆరోగ్యవంతుడిని కుడితే వైరస్ వ్యాపిస్తుంది. అందుకే ఇంటి వద్ద నీల్వ నీటిని తొలగించడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం, కాలనీలు, పాఠశాలలు, కార్యాలయాల్లో పరిశుభ్రత నిర్వహించడం అత్యంత అవసరం.

**చిన్నారుల్లో కనిపించే లక్షణాలు...**
**ఇవి కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి..**

డెంగ్యూ లక్షణాలు మొదట్లో సాధారణ వైరల్ జ్వరాల్లాగే కనిపిస్తాయి. దీంతో చాలామంది తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ మూడు నుంచి ఐదు రోజులలో వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.

పిల్లల్లో అకస్మాత్తుగా 102 – 104 డిగ్రీల వరకు అధిక జ్వరం రావడం, తీవ్రమైన




తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, శరీరం మొత్తం నొప్పులు, వాంతులు, ఆకలి తగ్గకపోవడం, నీరసం, చర్మంపై ఎర్రటి దద్దుర్లు వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొంతమందిలో జ్వరం తగ్గిన తర్వాతే ప్రమాదకరమైన పరిస్థితి ప్రారంభమవుతుంది. కడుపు నొప్పి, నిరంతర వాంతులు, ముక్కు లేదా చిగుళ్ల నుంచి రక్తస్రావం, నల్లటి మలం, తీవ్రమైన బలహీనత, చేతులు కాళ్లు చల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తరలించాలి. ఇవి తీవ్రమైన డెంగ్యూకు సంకేతాలు కావచ్చు.

**జ్వరం వచ్చినప్పుడు చేయాల్సినవి... చేయకూడనివి...**

జ్వరం వచ్చిన వెంటనే ఇంట్లోనే స్వయంగా మందులు వేసి ఆలస్యం చేయకూడదు. వైద్యుడిని సంప్రదించి ఆయన సూచించిన పరీక్షలు చేయించుకోవాలి. రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిందా లేదా అనేది వైద్యుల సూచన మేరకే పరీక్షించాలి.

ప్రతి జ్వరానికి వెంటనే ప్లేట్‌లెట్లు పరీక్షించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. వైద్యుల సూచన లేకుండా యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ మాత్రలు, స్టెరాయిడ్లు వంటి మందులు వాడకూడదు. పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వాలి. ఎక్కువగా నీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీరు, నిమ్మరసం, సూప్, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు ఇవ్వాలి. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవడం డెంగ్యూ చికిత్సలో అత్యంత ముఖ్యమైన అంశం. డాక్టర్ సూచించిన మందులను మాత్రమే వాడాలి.

**డెంగ్యూను నివారించడానికి ప్రతి కుటుంబం తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

డెంగ్యూ నివారణలో పరిశుభ్రతే ప్రధాన ఆయుధం. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండనివ్వకూడదు. వారానికి కనీసం ఒకరోజు నీటి పాత్రలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి. నీటి ట్యాంకులకు బిగుతుగా మూతలు పెట్టాలి. కూలర్లలోని నీటిని తరచూ మార్చాలి. పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు, సీసాలు వంటి వాటిని ఇంటి చుట్టూ పేరుకుపోనివ్వకూడదు.

పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు పూర్తి చేతుల దుస్తులు ధరించేలా చూడాలి. దోమతెరలు ఉపయోగించాలి. దోమల నివారణ క్రీములు లేదా రిపెల్లెంట్లు ఉపయోగించాలి. ఉదయం, సాయంత్రం సమయంలో దోమల కాటు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. కాలనీల్లో ఫాగింగ్ నిర్వహించడం మాత్రమే సరిపోదు. ప్రతి ఇంటి యజమాని పరిశుభ్రత పాటిస్తేనే డెంగ్యూ వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చు.

**ప్లేట్‌లెట్లు తగ్గితేనే డెంగ్యూ అనుకోవడం తప్పు..**

చాలామందిలో డెంగ్యూ అంటేనే ప్లేట్‌లెట్లు తగ్గిపోవడమే అనే అపోహ ఉంది. కానీ ప్రతి డెంగ్యూ రోగిలో ప్లేట్‌లెట్లు ప్రమాదకర స్థాయికి తగ్గవు. అలాగే ప్లేట్‌లెట్లు తగ్గడానికి డెంగ్యూ ఒక్కటే కారణం కాదు. కాబట్టి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా వైద్యుల సలహాలు మాత్రమే పాటించాలి. అవసరం లేకుండా ప్లేట్‌లెట్ మార్పిడి చేయడం కూడా సరికాదని వైద్యులు సూచిస్తున్నారు.

**పిల్లల ఆరోగ్యమే ప్రధానం...**

"డెంగ్యూ అనేది భయపడాల్సిన వ్యాధి కాదు... కానీ నిర్లక్ష్యం చేయకూడని వ్యాధి. చిన్నారులకు జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లో స్వయంగా మందులు వాడకండి. వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి. పిల్లలకు ఎక్కువగా ద్రవాహారం ఇవ్వాలి. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించి, దోమల నివారణ చర్యల్లో భాగస్వాములు అయితే డెంగ్యూ వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చు. ప్రజల అప్రమత్తతే డెంగ్యూపై నిజమైన ఆయుధం."



**డాక్టర్ స్వప్న శశికాంత్**
**చిన్న పిల్లల వైద్యురాలు**

# నిర్మల్ జిల్లాలో దొంగతనాల అదుపునకు 7 ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు:

నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణ పరిధిలో దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడంతో పాటు ప్రజల ఆస్తులకు తగిన రక్షణ కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణ పరిధిలోని ఏడు కీలక ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు.

**పట్టణ పరిధిలోని కీలక తనిఖీ కేంద్రాలు:**
గజులపేట్ ఔట్‌స్కర్ట్స్, సెయింట్ థామస్ స్కూల్ ప్రాంతం, సిద్ధాపూర్, సోఫీ నగర్ దర్గా ప్రాంతం, మహాలక్ష్మి ఆలయం ప్రాంతం, వైఎస్ఆర్ కాలనీ రోడ్, మంజులాపూర్ ప్రాంతాల్లో ఈ ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద 24 గంటల పాటు పోలీసు సిబ్బంది విధుల్లో ఉండి రాకపోకలు సాగించే వాహనాల తనిఖీలు చేపట్టనున్నారు.

రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం:
దొంగతనాలకు పాల్పడే పాత నేరస్థుల కదలికలను నియంత్రించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో పోలీసుల పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి, అనుమానాస్పదంగా సంచరించే వాహనాలను, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు.

**నేరాల నివారణే ప్రాథమిక ధ్యేయం:**
పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ తెలిపారు. దొంగతనాలు లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తుందన్నారు.



**ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలి:**
ప్రజలు తమ నివాస పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అపరిచిత కార్యకలాపాలను గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

పట్టణ భద్రతకు ప్రజల భాగస్వామ్యం:
ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో పోలీసు శాఖతో పాటు స్థానిక ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో పోలీసు సిబ్బందికి వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ముధోల్ ప్రభుత్వ భూముల్లో అక్రమ మొర్రం తవ్వకాలపై జాయింట్ సర్వే



ముధోల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమ మొర్రం తవ్వకాలను అరికట్టేందుకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు గురువారం సంయుక్తంగా జాయింట్ సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కొరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
సర్వేలో భాగంగా ముధోల్‌లోని 425 సర్వే నంబర్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మొర్రం తవ్విన ప్రదేశాలను పరిశీలించి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు.
అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
స్థానిక ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అక్రమ తవ్వకాలపై అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సర్వేలో మైనింగ్ ఏడీ తిరుమలరావు, రెవెన్యూ ఆర్ఐ నారాయణరావు పటేల్ పాల్గొన్నారు.




దిలావర్‌పూర్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ వెన్నెల వాక్కు మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. ఇటీవల "ఆధార్ కోసం ఆగని అవస్థలు" శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించి, గత రెండేళ్లుగా నిలిచిపోయిన ఆధార్ సేవలను దిలావర్‌పూర్ మండలంలో తిరిగి ప్రారంభించింది. దీంతో మండల ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



గత రెండేళ్లుగా ఆధార్ నమోదు, సవరణలు, బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, మొబైల్ నంబర్ నమోదు, చిరునామా మార్పు వంటి సేవల కోసం మండల ప్రజలు నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఒక్క ఆధార్ పనికోసం రోజంతా సమయం వెచ్చించడంతో పాటు ప్రయాణ ఖర్చులు భరించాల్సి రావడం ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వెన్నెల వాక్కు ప్రచురించిన కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది.
ఈ కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇకపై మండల ప్రజలు ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలను స్థానికంగానే పొందే అవకాశం లభించింది. జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో ప్రజల సమయం, ప్రయాణ వ్యయం గణనీయంగా తగ్గనుంది.
కొత్తగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) పరిశీలించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని, ఆధార్ నమోదు, సవరణలు, బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, ఇతర సేవలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సేవల కోసం వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అనవసర జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
ఆధార్ కేంద్రం పునఃప్రారంభం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను ప్రజల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తెలంగాణ వెన్నెల వాక్కుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అభినందించారు. ఇకపై ఆధార్ సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండటంతో వేలాది మంది ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వీబీజీ రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్లకు 3 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలి: గోవిందుల మహేష్



నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా జీతభత్యాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని విజిబిల్ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గోవిందుల మహేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
జీతాలు లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిబ్బంది పట్ల అలసత్వం సరికాదన్నారు.
ప్రభుత్వం స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ ప్రకటించడంతో పాటు, బకాయి ఉన్న 3 నెలల వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరారు.
సమస్యపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మహేష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# దిలావర్‌పూర్ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఆర్ఓ రాథోడ్ రమేష్



దిలావర్‌పూర్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల కేం ద్రంలోని ప్రభుత్వ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జి ల్లా రెవెన్యూ అధికారి (డీఆ ర్ఓ), మండల ప్రత్యేక అధికారి రాథోడ్ రమేష్ గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థినులతో ముచ్చటించి వస తులపై ఆరా తీశారు.
పదో తరగతి విద్యార్థినులకు పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రతిభను పరిశీ లించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశిం చుకుని కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ముఖ్య మైన ఫార్ములాలు గుర్తుంచుకునేందుకు గోడలపై చార్ట్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.
హాస్టల్‌లో భోజనం, తాగునీరు, పరిశుభ్రత సౌకర్యాలను పరిశీలించిన అనంతరం విద్యార్థినులతో కలిసి డీఆర్ఓ భోజనం చేశారు. ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన్, సంక్షే మ శాఖ అధికారులు, హాస్టల్ సిబ్బం ది పాల్గొన్నారు.

# దేవాలయాలు... దైవ దర్శన కేంద్రాలే కాదు, భారతీయ సంస్కృతికి చిరస్థాయి నిలయాలు

భారతీయ జీవన విధానంలో దేవాలయానికి ఉన్న స్థానం అత్యంత విశిష్టమైనది. ఆలయం అంటే కేవలం గంట మోగించి, కొబ్బరికాయ కొట్టి, కోరికలు కోరుకునే స్థలం మాత్రమే కాదనే విషయాన్ని మనం తరచూ మర్చిపోతుంటాం. భారతీయ నాగరికతను పరిశీలిస్తే దేవాలయాలు ఒకప్పుడు విద్యా కేంద్రాలు, కళా నిలయాలు, ధర్మబోధ కేంద్రాలు, సామాజిక సేవా సంస్థలు, గ్రామాభివృద్ధికి దిక్సూచిగా నిలిచినట్లు చరిత్ర చెబుతోంది.
"ధర్మో రక్షతి రక్షితః" అనే సనాతన ధర్మ సూత్రం భారతీయ సంస్కృతికి మూలాధారం. ధర్మాన్ని కాపాడితే అదే మనల్ని కాపాడుతుందనే ఈ భావన ఆలయ వ్యవస్థలో ప్రతిఫలిస్తుంది. అందుకే ప్రాచీన భారతదేశంలో రాజులు ఆలయాలను కేవలం ఆరాధనా కేంద్రాలుగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కేంద్రాలుగా తీర్చిదిద్దారు.
చోళులు, కాకతీయులు, విజయనగర రాజులు నిర్మించిన దేవాలయాలను పరిశీలిస్తే అక్కడ శిల్పకళ మాత్రమే కాదు, సమాజ నిర్మాణం కూడా కనిపిస్తుంది. నాట్యకళాకారులు, వేద పండితులు, సంగీత విద్వాంసులు, శిల్పులు, చిత్రకారులు, రైతులు, వృత్తిదారులు---అందరికీ ఆలయం ఒక జీవనాధారంగా ఉండేది. ఆలయం చుట్టూనే గ్రామ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందేది.
నేటి పరిస్థితుల్లో ఆలయాలపై భక్తుల విశ్వాసం మరింత పెరిగింది. ప్రతి రోజు వేలాది మంది దర్శనాలకు వెళ్తున్నారు. హుండీ ఆదాయాలు కూడా పెరుగుతున్నాయి. అయితే ఈ భక్తి మన వ్యక్తిత్వాన్ని ఎంతవరకు మార్చుతోంది అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. ఆలయానికి వెళ్లి వచ్చిన తర్వాత కూడా అబద్ధం, అవినీతి, స్వార్థం, ద్వేషం, అసహనం మనలో కొనసాగితే ఆ దర్శనం పరిపూర్ణం కాలేదని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటారు.
భగవద్గీతలో శ్రీకృష్ణుడు కర్మ, కర్తవ్యం, నిష్కామ సేవ గురించి బోధించాడు. రామాయణం ధర్మబద్ధమైన జీవనాన్ని నేర్పింది. మహాభారతం అధర్మం ఎంత బలంగా కనిపించినా చివరికి ధర్మమే గెలుస్తుందని తెలియజేసింది. ఈ మహాగ్రంథాల సారాన్ని సమాజానికి చేరవేసే బాధ్యత కూడా దేవాలయాలదే.
తెలంగాణలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం, యాదాద్రి, వేములవాడ, భద్రాచలం వంటి క్షేత్రాలు కేవలం భక్తి కేంద్రాలు మాత్రమే కాదు, మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలు. నిర్మల్ జిల్లాలోని అనేక పురాతన ఆలయాలు కూడా గ్రామీణ సంస్కృతిని నేటికీ సజీవంగా ఉంచుతున్నాయి. ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రభుత్వం ఒక్కటే చేయలేని పని. భక్తులు, గ్రామ సమాజం, యువత అందరూ భాగస్వాములు కావాలి.
నేటి యువతకు ఆధ్యాత్మికత అంటే మూఢనమ్మకం కాదని, అది క్రమశిక్షణ, విలువలు, బాధ్యత, సేవ, ప్రకృతి పరిరక్షణ, మానవత్వం అని వివరించాల్సిన అవసరం ఉంది. ఆలయంలో వెలిగించే ఒక దీపం కన్నా మన జీవితంలో వెలిగించే నిజాయితీ, సేవాభావం, కరుణ సమాజాన్ని మరింత ప్రకాశవంతం చేస్తాయి.
భారతదేశం వేల సంవత్సరాలుగా నిలబడి ఉండటానికి కారణం కేవలం రాజ్యాలు కాదు; ధర్మాన్ని జీవన విధానంగా మార్చుకున్న సంస్కృతి. ఆ సంస్కృతికి ఆలయాలే వెన్నెముక. అందుకే దేవాలయాలను సందర్శించడం మాత్రమే కాదు, అవి బోధించే విలువలను మన జీవితంలో ఆచరించడం కూడా అంతే ముఖ్యమైనది.
నేటి సమాజంలో పెరుగుతున్న హింస, కుటుంబ విభేదాలు, నైతిక విలువల క్షీణత వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చట్టాలతో మాత్రమే సాధ్యం కాదు. ధర్మం, నైతికత, మానవత్వం అనే విలువలు ప్రతి ఇంటిలో, ప్రతి మనసులో పునరుజ్జీవం పొందినప్పుడే సమాజం సుస్థిర అభివృద్ధి దిశగా సాగుతుంది. ఆ మార్పుకు దేవాలయాలు మరోసారి ప్రజల జీవితాలకు మార్గదర్శక కేంద్రాలుగా మారాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఆగస్టు 7న ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి సమావేశం

నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యాసంవత్సరం క్రీడల నిర్వహణపై శుక్రవారం (ఆగస్టు 7న) ప్రత్యేక జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఏ. రవీందర్ గౌడ్ తెలిపారు.
నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ సమావేశం జరగనుందని వెల్లడించారు. 70వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా జిల్లా, జోనల్ మరియు రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ కొరకు వ్యాయామ ఉపాధ్యాయుల నుండి ప్రతిపాదనలు స్వీకరిస్తామన్నారు.
ఆసక్తి కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ముందస్తు అనుమతి పత్రాలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.
పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ వ్యాయామ ఉపాధ్యాయులను ఆన్-డ్యూటీ పై ఈ సమావేశానికి పంపించాలని డీఈఓ భోజన్న ఆదేశించారు.

# సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి: కోదండ రెడ్డి

నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులతో కలిసి సేంద్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యానవన పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం, రైతుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో ఈ సమీక్షా సమావేశాన్ని ప్రారంభించారు.

**సంప్రదాయ పద్ధతులు వీడి పంట మార్పిడి చేపట్టాలి:**

ఈ సందర్భంగా చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడకుండా సేంద్రీయ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి పంట మార్పిడి విధానాలను విధిగా పాటించాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ పంట ఉత్పత్తుల నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక విధివిధానాలను రూపొందిస్తోందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రీయ ఉత్పత్తులకు అద్భుతమైన డిమాండ్ ఉందని, రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి:**

కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలోని రైతులకు సరిపడినంత ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. భూసారం దెబ్బతినకుండా అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పోడు భూముల సమస్యలు, ఉద్యాన పంటల విక్రయ మార్కెటింగ్ సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



**వరి,మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటల పెంపు:**

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో పంట మార్పిడి విధానాలను విశేషంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దాదాపు రెండు లక్షల మంది రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, సోయా, కందులు వంటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూల సాగు వంటి ఉద్యానవన రంగం వైపు రైతులను మళ్లిస్తున్నట్లు వివరించారు.

**ప్రాజెక్టుల కింద విస్తారంగా సాగునీటి లభ్యత:**

శ్రీరాంసాగర్, కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల కింద జిల్లాలో సాగు విస్తీర్ణం విస్తారంగా ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం దాదాపు 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు జరుగుతుండగా, ఇందులో 8,300 ఎకరాల్లో ఆయిల్ పామ్, 5 వేల ఎకరాల్లో పసుపు సాగవుతున్నాయని వివరించారు. ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ఎక్కువగా అధిగమించామని తెలిపారు.

**వేల ఎకరాల్లో భూముల రీ-సర్వే పనులు:**

రెవెన్యూ మ్యాపులు లేని 14 గ్రామాల్లో దాదాపు 30 వేల ఎకరాలకు గాను సర్వే చేపడుతున్నామని, అలాగే మరో 70 గ్రామాల్లో 62 వేల ఎకరాల భూముల సర్వే త్వరలోనే పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. భూ భారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కెవిఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, రామ్‌గోపాల్ రెడ్డి, సునీల్ కుమార్, గంగా ధర్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పాల్గొన్నారు.

## ముధోల్, బాసరలలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి 72వ జన్మదిన వేడుకలు

ముధోల్/బాసర, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి 72వ జన్మదిన వేడుకలను గురువారం ముధోల్ మండల కేంద్రంతో పాటు బాసర పుణ్యక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముధోల్ లో నిర్వహించిన వేడుకల్లో పలువురు నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలిచినా ఓడినా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అరుదైన నాయకుడని విఠల్ రెడ్డిని కొనియాడారు. నేడు అధికారంలో లేకున్నా నియోజకవర్గ సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్నారని వెల్లడించారు. ఆయన సుదీర్ఘకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

మరోవైపు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు విఠల్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనా కార్యక్రమాలు జరిపించారు. ఆయన మరిన్ని మేలైన సేవలు అందించాలని కోరుకుంటూ ఆలయ ప్రాంగణంలో యాచకులకు, పేదలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ వేడుకల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్, బాసీర్, సాయిరాం, కిష్టయ్య, అఫ్రోజ్ ఖాన్, సురేందర్ రెడ్డి, సర్పంచులు షబానా ఎజాజ్ ఉద్దీన్, సర్వేష్, బాసర మండల అధ్యక్షుడు దయాల లక్ష్మణ్ రావు, తీగల వెంకటేష్ గౌడ్, నూకం లింగరావు, చిట్టెపు రామారావు పాల్గొన్నారు.




# జిల్లా వ్యాప్తంగా శోభాయమానంగా ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు

బాసర/భైంసా/ముధోల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థలు, పరిశోధనా స్థానాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అత్యంత శోభాయమానంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు, అధికారులు, అధ్యాపకులు ఘనంగా నివాళులర్పించారు.



**ఆర్జీయూకేటీ బాసర ట్రిబుల్ ఐటీలో వేడుకలు:**

బాసర ట్రిబుల్ ఐటీ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజా ఉద్యమంగా మలచడానికి జయశం కర్ అందించిన దిశా నిర్దేశం చిరస్మరణీయమని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాధాన్యతను నాటి పాలకుల వివక్షను సమాజానికి స్పష్టంగా వివరించిన మహనీయుడని గుర్తుచేశారు. విద్యార్థులు జయశంకర్ ఆదర్శాలను, సామాజిక బాధ్యతను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపు నిచ్చారు.



**కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు:**

ట్రిబుల్ ఐటీలో కల్చరల్ కమిటీ కన్వీనర్ కే. రాములు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. జయశంకర్ జీవితంలోని కీలక ఘట్టాలను ఆయన వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు తెలంగాణ ప్రజా వాగ్గేయకారుల గీతాలను ఆలపించి సభను ఉత్తేజపరిచారు. ఈ వేడుకల్లో యూనివర్సిటీ అసోసియేట్ డీన్లు ఎస్. విటల్, శీలం శేఖర్, సాగర్, బి. విజయకుమార్, కే. మధుసూదన్, దేవరాజు, గుజ్జరి శంకర్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

**భైంసా జిన్నింగ్ ఫ్యాక్టరీలో పూజా కార్యక్రమాలు:**

భైంసా పట్టణంలోని భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి జన్మదిన వేడుకలను నిర్వహిం చారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత కర్తగా, మార్గదర్శిగా రాష్ట్ర సాధనలో దిశా నిర్దేశం చేసిన మహానేత అని కొనియాడా రు. కార్యక్రమంలో ముధోల్ ఎంపీపీ సుభా ష్ జాదవ్, కాసారోళ్ల రామకృష్ణ, ట్రస్ట్ సభ్యు లు, లైబ్రరీ అభ్యర్థులు పాల్గొన్నారు.



**విద్యార్థుల నివాళులు:**

ముధోల్ మండల కేంద్రంలోని రబింద్ర పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ అసంవర్ సాయి నాథ్, ప్లే స్కూల్ ఇంచార్జ్ హేమలత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్ పాల్గొన్నారు.



రబింద్ర పాఠశాలలో

**వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తల పూజలు:**

ముధోల్ మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఆకుల దినేష్, డాక్టర్ రాహుల్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానము సిబ్బంది, సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుండి కాగితరహిత విధానంలోనే ఐఎఫ్ఎమ్ఎస్ బిల్లుల సమర్పణ

నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన డిజిటల్ విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్ఎమ్ఎస్ ( ద్వారా పేపర్‌లెస్ (కాగిత రహిత) బిల్లుల సమర్పణ విధానాన్ని ఆగస్టు 15 నుండి అమలు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా ఖజానా అధికారి సరోజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బిల్లులన్నింటినీ ఆగస్ట్ 15వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని ఆమె వివరించారు. డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు బిల్లులతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను స్కాన్ చేసి జత చేయాలన్నారు. సమర్పించే పత్రాలన్నీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 ప్రకారం చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకంతో ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 15 నుండి ఖజానా కార్యాలయాలకు ఎలాంటి హార్డ్ కాపీ (కాగిత రూప) బిల్లులను సమర్పించకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఉపకోశాధికారి కార్యాలయాల అధికారులు (ఎస్టీవోలు) తమ పరిధిలోని అన్ని శాఖల కార్యాలయాలకు ఈ ఆదేశాలను తెలియజేసి పకడ్బందీగా అమలు చేయాలని సరోజ ఆదేశించారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న 'జైల్ భరో': సంయుక్త కిసాన్ మోర్చా

నిర్మల్, ఆగస్టు 6 (తెలంగాణ వెన్నెల వాక్కు): నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ టీఎన్‌జీఓస్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.



కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులపై ఉన్న అప్పుల భారాన్ని తొలగించేందుకు సమగ్ర రుణ విమోచన చట్టం తీసుకురావాలని కోరారు.

విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, 2013 భూ సేకరణ చట్టం, అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 10న జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే జైలు భరో నిరసనలో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు నందిరామయ్య, డాకూర్ తిరుపతి, దుర్గం నూతన్ కుమార్, కే. రాజన్న, సింగరి వెంకటేష్ పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com